మంటున్నాడు. వాణ్ణి యింకా క్షోభపెట్టకు. రాయివై పూజ లందుకుంటూ లోకరక్షణభారం వహించిన ఓ భగవంతుడా! పట్టెడన్నం దొరకని యీ పసివాడి కన్నీరు మహా ప్రవాహమై యీ భువిని ముంచి వేస్తుందేమో జాగ్రత్త! వాడి క్షుధాగ్నిజ్వాలలు యీ ప్రపంచాన్ని దగ్ధంచేస్తాయేమో జాగ్రత్త!!

ముందు జాగ్రత్తలోవుంటే ఎందుకైనా మంచిది!

# మళ్లీ మొదలైన కథ

"కాలవకు కొత్త నీళ్ళొచ్చినట్టున్నాయి" అనుకున్నాడు మల్లన్న గాలం నీళ్ళలోకి విసురుతూ... "ఇంక కావలసినన్ని చేపలు... రకరకాల చేపలు..."

ఉదయం ఎనిమిది గంటల వేళ... కాలవలో వరదనీరు వేగంగా ప్రవహిస్తున్నది. సూర్యుని ఎర్రని కిరణాలు నీటి ప్రవాహానికి రకరకాల రంగులు పూస్తున్నాయి. చిన్న చిన్న తరంగాలతో ప్రవాహం ఒకచోట బురదపాములు కదలాడుతున్నట్లూ, మరొకచోట ఎర్రని కాంతులవల్ల రక్తపింజరులు పొరలుతున్నట్లూ కనిపిస్తున్నది.

మల్లన్న కాలవ ఒడ్డునే ఒక రాతిమీద కూర్చుని వున్నాడు. అతని కాళ్ళక్రింద వేగంగా ప్రవహిస్తున్నది కాలవ. అతని చేతిలో గాలంవుంది... పక్కనే మరొక రాతి మీద పూలువుండవలె అందంగా చుట్టబడిన వానపాము లున్నాయి. అక్కడికి కొద్దిగజాల దూరంలో మరొక మనిషి కూర్చునివుండి చేపలు పడుతున్నాడు. అతడు వాడుతున్న వల చాలా అనుకూలంగావుంది. దాన్ని 'దేవువల' అంటారు. వలను ఒక్క నిముషంసేపు నీళ్ళలోనుంచి పైకిలాగితే సరి... ఎన్నిరకాల చేపలో ... గిలగిలలాడుతూ దొరికిపోతాయి. అతడు త్వరత్వరగా తనబుట్టనింపుకుంటున్నాడు. ప్రతి మూడూ లేక నాలుగు గంటల కొకసారి చేపల మార్కెట్టునుంచి ఒక మనిషివచ్చి వాటిని వెంటవెంటనే తీసుకువెళ్ళిపోతూవుం టాడు. రోజుకు ఎంత లేదన్నా ఏడెనిమిదిరూపాయల రాబడి వుంటుం దతనికి.

దాదాపు నెలరోజులనుంచీ మల్లన్నకు ఈ పోటీవచ్చి పడింది. అంతకుముందు ఆ రైలువంతెన పక్కన అతడుతప్ప మరెవరూ వుండేవారుకారు. ఒకటి రెండు రోజులపాటు ఈ నూతనుడి వ్యవహారం చూడగానే మల్లన్న చలించిపోయాడు అతడు వాడుతున్న వల పదిహేనురూపాయలుచేస్తుంది. తాని న్నాళ్లనుంచీ గంటల తరబడి రోజూ గాలాన్ని అలా నీళ్ళలో వేసుకుని కూర్చున్నప్పటికీ తనకు ఎన్నడూ రూపాయికిమించి ఆదాయం రాలేదు. వీడెవడో వచ్చీరాగానే డబ్బులు పం డించుకోవడం ప్రారంభించాడు. అతడు వచ్చిన మొదటిరోజున మల్లన్న కేవలం గుడ్లప్పగించి చూడటం తప్ప ఏమీ

మాట్లాడలేదు. రెండోరోజున అతన్ని "మీ దేవూరు?" అని అడిగాడు. అతడు గర్వంగా 'మద్రాస్' అని సమాధానం చెప్పి వలపైకి లాగేసరికి మల్లన్న కళ్ళు చెదిరిపోయాయి. వల నిండా చంద్రవంకలు గిలగిలలాడుతూ దొరికిపోయాయి. ఆ రకం చేపలకు బజారులోవున్న గిరాకీ మల్లన్నకు తెలుసు. జనం ఎంత ఖరీదయినాసరే వాటిని ఎగరేసుకుపోతారు. మల్లన్న ఈర్ష్యతో అతనివంక చూశాడు. అతడు మళ్లీ వలను నీళ్ళలో ముంచుతూ గర్వంతో "నా పేరు కృష్ణన్" అనికూడా అన్నాడు. మల్లన్న మనసులో "బాగానేవుంది. మద్రాసు నుంచీ ఇక్కడికివచ్చి చేపలు పడుతున్నాడా వీడు?... అక్కడ కాలవలూ, నదులూ లేవేమో!" అనుకున్నాడు. తర్వాత రోజులు గడిచేకొద్దీ, గాలాన్ని నీళ్లలోవుంచి సోమరిగా కూర్చునే మల్లన్నా, నిముషనిముషానికీ వలలోనుంచి చేపలుతీసి బుట్ట నింపుకునే ఆ మద్రాసు మనిషీ మాట్లాడుకుంటూవుండేవారు. కృష్ణన్‌కు ఎన్నో విషయాలు తెలుసు. అతడు సినిమాలనుగురించీ, మల్లన్న ఎన్నడూ చూడని 'మద్రాస్' అనబడే మహానగరాన్నిగురించీ చెబుతూవుండేవాడు. అతడు సాహసి అనికూడా మల్లన్నకు బోధపడింది. ఎందువల్లనంటే కృష్ణన్ మద్రాసునుంచి యిక్కడికి అసలు టిక్కెట్టే కొనకుండా రైల్లో వచ్చాట్ట!

మల్లన్న ప్రశాంతంగా కూర్చున్నాడు. ఇవ్వాల్టితో తన బాధలన్నీ తీరిపోతాయనీ, మరునాటినుంచీ తాను కృష్ణన్ వాడుతున్న వల వంటిదే తెచ్చుకోగలననీ అనుకున్న

ప్పుడు అతడు గర్వంతో పొంగిపోతున్నాడు. నలభై అయి దేళ్ళ జీవితంలో అతడెన్నడూ సుఖపడలేదు. భూమిన పడి నప్పటినుంచీ కష్టాలుకూడా ప్రారంభమై యిప్పటి వరకూ అతన్ని వదిలిపెట్టనే లేదు. ఈ ముసలితనంలో కూడా సుఖ పడేందుకు వీలులేకుండా భగవంతుడు తనకు నికృష్టపు సంతా నాన్ని యిచ్చాడు. మల్లన్నకు తన గుడిసెలో మూలగా ఎప్పుడూ మంచంమీద పడుకుని దీనంగా చూస్తూ వుండే పెద్దకొడుకు జ్ఞప్తికి వచ్చాడు. అతనికి యిరవై ఏళ్లుంటాయి. కాళ్ళు రెండూ పక్షవాతం వల్ల పడిపోయాయి. రెండేళ్ళ నుంచీ మంచంలో పడివున్నాడు. రెండో వాడున్నాడు కాని వాడివల్ల ఏమీ లాభం లేకపోగా ప్రమాదమే ఎక్కువ. నిండా పద్దెనిమిదేళ్ళయినాలేవు. వాడప్పుడే పెద్ద రౌడీ అయి నాడు. ఎప్పుడూ, ఎందుకూ కొరగాని సోమరిపోతు స్నేహితు లను వెంటవేసుకుని బజార్ల వెంట అడ్డమైన తిరుగుళ్ళూ తిరు గుతూ పాడైపోయాడు. జేబులు కొట్టడంలోనూ, మోసాలు చెయ్యడంలోనూ ఆరితేరి యింటిపట్టున వుండకుండా తిరుగు తున్నాడు. ఒకసారి యింటికివచ్చి తండ్రిదగ్గర పశ్చాత్తాపం నటించి, ఆ కుంటివాడికి వైద్యం కోసమని తండ్రి అడపా దడపా దాచుకుంటూ వచ్చిన డబ్బుకాస్తా కాజేసి ఉడాయిం చాడు. మళ్ళీ అంతులేదు. అప్పటినుంచీ మల్లన్న డబ్బు తనదగ్గర వుంచుకోవటం మానేశాడు. రోజూ తనకు వచ్చిన దాన్లో ఏ కొంచెమో దాచిపెడుతూ వచ్చాడు. అతని కిప్పుడు కావలసిందల్లా దేవు వల. అది సమకూర్చుకుంటే తనకు మరేమీ అక్కర్లేదు. అయినా యీ గాలాలు పాత

కాలపు సాధనాలు...... వీటివల్ల ఆట్టే ప్రయోజనంలేదు. పాటెక్కువా ఫలం తక్కువానూ!...

మల్లన్న నెల రోజులనుంచీ తనదగ్గర మిగిలిన చిల్లర అంతా కమ్మరి బసవయ్య దగ్గర దాచివుంచాడు. కమ్మరి బసవయ్య దొడ్డ పెద్దపాక......ఇంటిముందు రేకుల షెడ్డులో యిద్దరు పనివాళ్ళతో అతని పరిశ్రమ సాగుతూ వుంటుంది. బసవయ్యకు ముప్ఫయిమేళ్ళు వుంటాయి. చిన్నవాడే. తియ్యగా స్నేహంగా మాట్లాడుతాడు...అతని కనుబొమలు రెండూ కలుసుకునేచోట ఒకకందిరీగ వాలినట్టుగా గుబురుగా వెంట్రుకలుంటాయి. బొమికలు వెళ్ళుకొచ్చినమొహం గుప్పు గుప్పున మండే కొలిమి కాంతిలో చిత్రంగా కనిపిస్తూవుం టుంది. మల్లన్నకు అతనిమీద వల్లమాలిన విశ్వాసం.... మొన్ననే బసవయ్య కనుపించి "పధ్నాలుగు రూపాయలయిం దోయ్ నీ డబ్బు...ఎప్పుడు తీసుకుపోతావు?" అని అడిగాడు. తానేమో "అప్పుడేవొద్దు...ఇంకా ఒకరూపాయి కావాలి. తర్వాత తీసుకుంటానులే..." అని చెప్పాడు. అతడు నవ్వి వెళ్ళిపోయాడు.

చేతిలోవున్న గాలం బరువెక్కినట్టు తోచి మల్లన్న సర్దుకు కూర్చుని నెమ్మదిగా లాగటం ప్రారంభించాడు. తీరా చూశాక అతడు హతాశుడైనాడు...ఆ చేప ఎంత టక్కరిదో? గాలం ముల్లు గొంతులోకి దిగబడకుండా అతి జాగ్ర త్తగా ఎరనుమాత్రం తిని చేవున త్రెన్చి తనదారిన తాను వెళ్ళిపోయింది.

మల్లన్న మళ్ళీ వానపాముల వుండనుతీసి ఒక వాన పామును తుంపి గాలంముల్లుకు తగిలించి, నీళ్ళలో వేశాడు. వానపాములు వుండలోనుంచి తలలు పైకిచాపి కదులుతు న్నాయి. మల్లన్న తనలో 'వీటిని వానపాములని ఎందుకం టాగో, వానకురిస్తే యివికూడా వస్తాయేమో! వానపాముల అని ఒక వూరుందట ... అక్కడ వానపాము లెక్కువగా ఉంటాయేమో?' అనుకున్నాడు.

అతనికి బీడీ కాలుద్దామనిపించింది. గాలం కర్రను చంకలో పదిలంగావుంచుకుని బొడ్లోనుంచి బీడీ నొకదాన్ని పైకితీసి, కృష్ణన్‌వైపు తిరిగి పెద్దగా "నిప్పులపెట్టె ఒక సారి యివ్వవయ్యా" అని అడిగాడు. అతడు దూరంనుంచే విసిరి వేసిన అగ్గిపెట్టెను అందుకుని పుల్లగీచి బీడీ వెలిగించుకొని మళ్ళీ దాన్ని కృష్ణన్ దగ్గరికి విసిరివేశాడు.

అలా ప్రశాంతంగా కూర్చుని బీడీ కాలుస్తూ కొన్ని నిముషాలు గడిపాడే కాని అతని మనసు తొందరపడుతున్నది. అప్పుడే ఎండ కొరకొరలాడుతున్నది... ఇంతవరకూ ఒక్క చేపకూడా పట్టుబడలేదు. ఇంకా తనకు ఒక రూపాయి కావాలి... రేపు మంచిరోజు. ఉదయాన్నే వెళ్ళి వల కొను క్కుని కృష్ణన్ కంటె ముందుగా యిక్కడికి వచ్చి కూర్చుని అతడు వొచ్చేవేళకు ఆశ్చర్యంతో నోరు తెరిచేట్టుచెయ్యాలి. అసలే నలుపలకలుగా నల్లని పళ్ళెంలావుండే అతని మొహం అప్పుడెట్లావుంటుందో! ఆ వలను తాను రోజూ చూస్తు న్నాడు. వలలమ్మేవాడి యింటి పంచలోవుంది. ఎంత అందంగా వుంటుందనీ!

కృష్ణన్ చేపలతో నిండిన బుట్టను మార్కెట్టునుంచి వచ్చిన మనిషికి యిస్తున్నాడు. మళ్ళీ ఖాళీబుట్ట అందుకుం టున్నాడు. అదికూడా మరొక గంటలో నిండిపోతుంది. అంతా డబ్బే ... చంద్రవంక చేప అంటే జేడ డబ్బులని అర్థం...

మల్లన్న బీడీ అవతలపారేసి, వుమ్మేశాడు. దూరంగా వొంతెనమీద రైలొకటి పోతున్నది. ఒక కాకి అతనికి దగ్గ రలో కూర్చునివుండి కావు కావుమని రొదచేస్తున్నది.

అతడు నీళ్లలోకి చూశాడు. చిక్కిపోయిన తన శరీరం కనిపించింది. మరికొంచెం జాగ్రత్తగాచూస్తే పండిపోయిన తన తలా, గుంటలుపడిన కళ్ళూ కనిపించాయి. పైన ఎగురు తున్న డేగ ప్రతిబింబంకూడా కనిపించింది.

ఈ నీళ్ళలో ఎన్నిరకాల చేపలు ... ఎంతెంత పెద్ద చేపలు ఉన్నాయో ! దొరికిన పురుగులనూ ఆకులనూ తింటూ ఎన్నిచేపలు బలిసి సోమరిగా ఆవులిస్తూ తిరుగు తున్నాయో !

మల్లన్నకు తొందర ఎక్కువయింది. ఇంకా రూపాయి కావాలి. ఒక్క రూపాయి ! ఘల్లుఘల్లుమని ఎగురుతూ అతని కళ్ళముందు రూపాయినాట్యంచేస్తున్నది. ఇక ఒక్కరూపాయి సమకూడితే అటువంటి వల తనదవుతుంది. ఆ తర్వాత సంపా దనకు లోటుండదు, కుంటివాడై దీనంగా మంచానపడి అలమటిస్తున్న కొడుకు బాగవుతాడు ! ... అల్లరిచిల్లరిగా తిరుగుతున్న చిన్నకొడుకులో పరివర్తన వస్తుంది.

సూర్యబింబం, మండుతూ నిప్పులు చిమ్ముతున్న విష్ణువుచేతి చక్రంలావుంది. వెచ్చనిగాలి వీస్తున్నది. ఒక డేగ నీళ్ళమీదుగా ఎగురుతూవచ్చి ఒకచేపను తన్నుకుపోయింది. కృష్ణన్ వల భుజంమీద వేసుకుని ఆ పూటకు పనిచాలించి తిండికోసం ఇంటికి వెళ్ళిపోయాడు.

మల్లన్న కదలలేదు. అతనికి ఆకలి చచ్చిపోయింది. పొద్దున తాగిన గంజినీళ్లుతప్ప అతడు మరేమీ ఎరగడు. అయినా అతనికి ఆకలికావటంలేదు. ఇంటిదగ్గర కుంటివాడిదీనావస్థ జ్ఞప్తికివచ్చింది. కాని 'పోన్లే, యీ పూటకు ఎలాగో దేకుతూవెళ్ళి ముంతలోవున్న కాసినిపల్లనీళ్ళూ తాగుతాడు. వాడికోసం కాదూ తన యీ కష్టమంతా ? ఒక్కపూట ఇబ్బందిపడితే ఫరవాలేదులే" అనుకున్నాడు.

తర్వాత ఆ నీళ్ళ మహారాజ్యంలో 'ట్రాఫిక్ రూల్స' అనేవి లేకుండా, తమ చిత్తంవచ్చినట్టు నిర్లక్ష్యంగా సంచరించే పెద్దపెద్ద చేపలనుద్దేశించి మాట్లాడటం ప్రారంభించాడు. "ఓ చేపల్లారా! రండి ... ఈ గాలానికివున్న వానపాము ఎంత రుచిగావుంటుందో తెలుసా ? అంత రుచిగల పదార్థం సృష్టిలోనేలేదు. అమృతమంటారే అదికూడా దీనిముందు తీసికట్టే...రండి రండి, కొంచెం కొంచెంగా రుచిచూడండి... ప్రార్థనవిని రండి..."

కృష్ణన్ తిండి ముగించుకుని మళ్ళీ వలతోసహా సిద్ధమయ్యేసరికి మల్లన్న చేపలతో సంభాషిస్తూ కనిపించాడు. అతడు నవ్వి "ఏమయ్యోయ్ ! ఎవరితో నువ్వు మాట్లాడు

తున్నది ?'' అని అడిగేసరికి మల్లన్న అదిరిపడి "అబ్బే నే నెవరితోనూ మాట్లాడటంలేదే..." అన్నాడు.

పొద్దువాలిపోతున్నది...అయినా మల్లన్న అలాగే కూర్చునివున్నాడు. ఈవేళ అతడు లేవగానే ఎవరి మొహం చూశాడోగాని ఒక చిన్న చేపపిల్ల అయినా కటాక్షించ లేదు...'ఇహ లాభంలేదు' అనుకున్నాడతడు.

"ఇవ్వాళ్టికి రూపాయి రావడంకల్ల. పైగా గంజి నీళ్ళు కాచుకునేందుకైనా పైసల్లేవే...కొట్టువాడికి పన్నెండు పైసలివ్వాలి కూడానూ. ఆ కుంటివాడికి సరేసరి...పొద్దుటి నుంచీ పుల్లనీళ్ళు తప్ప మరేమీలేవు. తనకుకూడా కడుపులో ఎలుకలు పరుగిడుతున్నాయి. ఏంచేసేట్టు?. కృష్ణన్‌ను ఒక పావలా డబ్బులు అప్పు అడిగితే యిస్తాడా ?"

ఉన్నట్టుండి మల్లన్న వొళ్ళు జలదరించింది. గాలం బరువెక్కి అతని చేతిలోని కర్ర వొంగిపోతున్నది. అతడు లేచాడు. బలమంతా ఉపయోగించి లాగటానికి ప్రయత్నం చేశాడు. రెండు చేతులతోనూ కర్రను గట్టిగా పట్టుకున్నాడు. పొద్దుటినుంచీ తిండి లేనందువల్ల లేచీ లేవగానే అతని కళ్ళు తిరిగినట్టయింది. అయినా పట్టుమాత్రం వొదలకుండా అలాగే ప్రయాసపడుతున్నాడు. చేపల మార్కెట్టునుంచి వచ్చిన మనిషి యిది చూచి మల్లన్నకు సాయంవచ్చాడు. అతడు బలవంతుడు. "ఇదేదో పెద్దదే..." అంటూ అతడు బల మంతా ఉపయోగించి యివతలికి లాగటం ప్రారంభించాడు.

ఇద్దరూ ఒక్క నిముషంసేపు శ్రమనడిన తర్వాత ఆ చేప ఒడ్డుమీద తపతపా కొట్టుకుంటూ, నీళ్ళను చింద

గోడుతూ యివతలికి వచ్చింది. మల్లన్న కళ్ళు నులుముకుని చూశాడు. ఆ చేప బాగా బలిసివుంది పొడుగ్గా వెడల్పుగా వుంది. ఇంకా అది తన శక్తికొద్దీ పెనుగులాడుతూనే వుంది. మార్కెట్టునుంచి వచ్చిన మనిషి తన బలమంతా ఉపయోగించి దాన్ని అదుపులోపెట్టి దానిమీద కూర్చుని అదిమి పట్టుకుని ఆయాసంతో వగరుస్తూ "రెండు రూపాయలిచ్చేస్తాను, నాకిస్తావా? మార్కెట్టులో అయినా అంతకంటే ఎక్కువరాదు నీకు...ఏమంటావు?" అంటున్నాడు. కృష్ణన్ కూడా తన వల తాటిని రాతికికట్టి లేచివచ్చి చూసి తల వూపి "అవును, రెండురూపాయలు ఫరవాలేదు...అయినా ఎంత పెద్దదో! నేనెన్నడూ ఇంత చేపను పట్టలేదు..." అన్నాడు.

మల్లన్న లేచి తలవూపి 'సరే' అన్నాడు. వెంటనే అతని చేతిలో రెండు రూపాయబిళ్ళలు పడ్డాయి. ఆ మనిషి చేపను తన శక్తినంతా ఉపయోగించి ఎత్తి భుజంమీద వేసుకుని "అమ్మబాబోయ్! మార్కెట్టుదాకా దీన్ని మోసుకుంటూపోతే చచ్చిపోతాను...దగ్గరలో రిక్షాఒకటి దొరికితే బాగుండిపోను..." అనుకుంటూ వెళ్ళిపోయాడు.

మల్లన్న గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. వానపాముల ఉండను విడదీసి వాటన్నిటినీ బురదలో స్వేచ్ఛగా వదిలి పెట్టాడు. తర్వాత గాలం తాటిని కర్రచుట్టూ చుట్టుకుని ఇంటికి బయలుదేరాడు. కృష్ణన్‌తో "చూడవోయ్!

రేపు నేనుకూడా ఇలాటి వలతెస్తాను కాచుకో...” అనేసి గర్వంగా అడుగులువేస్తూ బయలుదేరాడు...

అతడు నడిచివెళ్ళే దోవలో వలల వ్యాపారంచేసే వాడొకడున్నాడు. మల్లన్న అతన్ని బయటికి పిలిచి బేరం చేశాడు. అతడు తల తడువుకుంటూ “దేవు వలధర యీ మధ్య బాగా పెరిగిపోయిందయ్యా! మొన్న మొన్నటిదాకా పదిహేను రూపాయలే అమ్మాను...కాని...ఇప్పుడు గిట్టుబాటు కావడంలేదు ... రూపాయి ఎక్కువచేసుకో ... నీకు కాబట్టి ఈ ధర అయినా. రెండు...మూడు రోజుల కొకసారి వచ్చి బేరంచేస్తూ వుంటావేగాని నువ్వెప్పుడూ కొన్నదిలేదు. ధరలేమో పెరిగిపోతున్నాయి” అన్నాడు.

మల్లన్న “రేపు తప్పకుండా కొంటాను బాబ్బాబు! నీకు పుణ్యముంటుంది. ధర విషయం మరొకమాటచెప్పు... బీదవాణ్ణి నీకు తెలుసుగా...మా పెద్దవాడేమో మంచాన పడివున్నాడు. చిన్నవాడేమో యిల్లుపట్టకుండా తిరుగుతున్నాడు. కాస్తచూసి బేరంచెప్పు...... తెల్లవారుతూనే వొచ్చేస్తాను. యీ రాత్రికే బసవయ్యదగ్గర డబ్బు పట్టుకొచ్చేస్తాను...” అన్నాడు.

అతడు తల తడుపుకుంటూ ‘సరే...... నువ్వింతగా ప్రాధేయ పడుతున్నావు కాబట్టి పదిహేనున్నర చేసి యిస్తాను...మళ్ళా ఎవరికీ యీ ధర విషయం చెప్పకు... అందరూ యీ ధరకే కావాలంటే నేను నెత్తిన గుడ్డ కప్పుకు ఎళ్ళైనాపోవాలి... పైసాకూడా గిట్టుబాటుకాదు...నువ్వ

రేపు పొద్దున్నే పైకం తీసుకురా ... సరుకు సిద్ధంగావుంది ...'' అన్నాడు. మల్లన్న తలవూపి పంచలో గోడకానించబడి వున్న దేవువల వంక ఒకసారి చూశాడు. అది సంజె వెలుగులో తన పాలిటి వరప్రసాదంలా కనిపించింది.

అతడు ఇంటికి వెళ్ళేసరికి పాక అంతా సందె చీకటి వ్యాపించివుంది. "పిచ్చి నా తండ్రి ఎట్టావున్నాడో!" అనుకుంటూ మల్లన్న లోపలికి అడుగుపెడుతూనే కొడుకు పడుకునే నులకమంచంవంక చూశాడు.

ఆ కుంటివాడు మంచంకోటికి తల ఆనించి వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. మల్లన్నను చూడగానే బావురుమని ఏడుస్తూ, మెడ వాటేసుకున్నాడు. మల్లన్న ఆదుర్దాగా 'ఏమయిందిరా' అని తరిచి తరిచి అడగ్గా వెక్కి వెక్కి ఏడుస్తూనే అంతా చెప్పాడు... పక్క యింటివారు, ఎవరిదో శవం కాలవలో తేలుతూ వొచ్చిందనీ, వొడ్డుకు తీసి చూస్తే ఆ మనిషికి నలభై ఏళ్ళుంటాయని తేలిందనీ, చెప్పుకుంటున్నారట... అది విని వాడు మధ్యాహ్నంనుంచి అలా ఏడుస్తూనే వున్నాడు. "నువ్వు కళ్ళబడతావనుకోలేదే నాయనా?" అన్నాడు వాడు బెక్కుతూ.... మల్లన్న కళ్ళనీళ్ళు పెట్టుకొని "నా తండ్రే.... ఎంత కష్టపెట్టానురా నిన్ను.... లేదులే ఏడవకు!" అంటూ సముదాయించాడు.

తర్వాత మల్లన్న పక్కనేవున్న చిల్లరకొట్టుకు వెళ్ళి అంతకుముందు యివ్వవలసిన పన్నెండు పైసలూ యిచ్చి,

మళ్ళీ ఒక పావలాకు బియ్యమూ, మిగిలిన అవసరమైన వస్తువులూ కొన్నాడు.... ఒక గంటలో వంట పూర్తిచేసి కుంటి వాడికి కడుపునిండా తినిపించి తన పథకం అంతా వాడికి చెప్పాడు. వాడు నిట్టూర్చి "మన కష్టాలు తీరే రోజులొచ్చినట్టున్నాయిలే.... నా కాళ్ళే రావాలిగాని నిన్ను పువ్వుల్లో పెట్టుకోనూ నాయనా?" అన్నాడు.

మల్లన్న తనుకూడా తిండి ముగించి బసవయ్య ఇంటికి బయలుదేరాడు.

అప్పటికి బాగా పొద్దుపోయింది. అయినా బసవయ్య కుటీర పరిశ్రమ ఇరవైనాలుగుగంటలూ వుంటుంది. ఆ రేకుల షెడ్డులో ఎప్పుడూ కొలిమి గుప్పుగుప్పున మండుతూనే వుంటుంది. కండలు తిరిగిన మనిషి ఒకడు పెద్దసుత్తితో ఎర్రగా కాల్చబడిన ఇనప వస్తువులమీద కొడుతూవుంటాడు. బసవయ్య అక్కడే కూర్చునివుంటాడు.

కాని ఇవాళ షెడ్డు ఖాళీగా కనిపించింది. మల్లన్న నివ్వెరపోయాడు. మరికొంచెం దగ్గరగా వెళ్ళేసరికి షెడ్డు ముందు ఇద్దరు వ్యక్తులు కనిపించారు. వాళ్ళిద్దరూ అక్కడి పనివాళ్లు.

"బసవయ్య ఎక్కడ?" అని అడిగాడు మల్లన్న. వాళ్ళిద్దరూ మొహాలు చూసుకున్నారు. "ఇంకా ఎక్కడి బసవయ్య? నిన్న రాత్రినుంచీ పత్తాలేడు. అవతలి వీధిలో ఎవతెనో లేవదీసుకుని పరారైపోయాడు..మాకూ తెలియదు..

పొద్దున్నే మామూలుగా పనికివచ్చేసరికి ఇక్కడ ఏమీలేదు. దుర్మార్గుడు...మాకు నెలరోజుల కూలిడబ్బులు ఇవ్వాలి..." అన్నాడొకడు. మల్లన్న రాతివిగ్రహంలా నిలబడిపోయాడు. తర్వాత పెద్దగా "అట్టా జరగదు. బసవయ్య నన్ను అన్యాయం చెయ్యడు..." అంటూ వెళ్ళి పాకలో చూశాడు. పాత గోనెసంచులూ, జొగ్గుముక్కలూ తప్ప అక్కడ మరేమీ లేవు.

బయట నుంచునివున్న యిద్దరూ మల్లన్న జేవురించిన మొహంతో ఇవతలికి రావడం చూశారు. "ఏం? నీకూ-డా తలంటిపోయినాడా ? నే నప్పుడే అనుకున్నాను ... వాడి మొహంలోనే అసలు పచ్చి గొడ్డుమాంసం తినే లక్షణాలు కనిపించేవి....పాముల బుట్టలాగా, తలా....వాడూ..."అన్నాడొకడు.

మల్లన్న నిశ్శబ్దంగా ఇవతలికి వచ్చాడు. ఒక దుఃఖ తరంగం బలవంతంగా బయటికి రాబోయింది. అయినా మల్లన్న ఉద్వేగాన్ని అణచుకుని నడవటం ప్రారంభించాడు.

ఇంటికి వెళ్ళేసరికి కుంటివాడు ఇంకా మేలుకునే వున్నాడు. తండ్రి రావడం చూసి "నాయనా ? బసవయ్య పైకం ఇచ్చాడా ?" అని అడిగాడు."

మల్లన్న "అణిగి పడుండక యీ వూసులన్నీ నీ కెందుకు ? మన కర్మ..." అని కసురుకున్నాడు. వాడు చిన్న

బుచ్చుకుని తర్వాత నిశ్శబ్దంగా ఏడుస్తూ మరొకవైపుకు తిరిగి పడుకున్నాడు.

మల్లన్నకు నిద్రపట్టలేదు. అతడు కాస్సేపాగి లేచి ఇంట్లోకి వెళ్ళాడు...ఒకమూల గాలం కనుపించింది. దగ్గరికి వెళ్ళి దాన్ని కళ్ళకద్దుకున్నాడు. తర్వాత బయటికివచ్చి కొడుకు మీాదికివంగి చూశాడు. వాడు నిద్రపోతున్నాడు. బుగ్గలమీాద కన్నీటి చారలున్నాయి. వాడి గడ్డం పుణుకుతూ "పిచ్చి నా తండ్రి" అనుకున్నాడతడు. తర్వాత పడుకుంటే నిద్రపట్టింది కాని...అన్నీ కలలే.

మరునాడుఉదయం మళ్ళీ మల్లన్నగాలం అందుకుని భుజం మీాద వుంచుకుని బయలుదేరాడు. కిందటిరాత్రి వల బేరం చేసిన చోటికివచ్చి ఒక్కక్షణం నిలబడ్డాడు. బయట ఎవరూ లేరు. పంచలో దేవువల నిలబెట్టబడివుంది.

అతడు నిట్టూర్చి ముందుకు సాగిపోయాడు. కాలవ వొడ్డున కృష్ణన్ అంతకుముందేకూర్చుని పనిలో నిమగ్నుడై వున్నాడు. మల్లన్నను చూసి "వల తెస్తానంటివిగా..ఏదీ ?" అని అడిగాడతడు.

మల్లన్న బదులుపలకలేదు. తానుక్రిందటి సాయంకాలం బురదలో వానపాములను వదిలిపెట్టినచోట మళ్ళీ చేతులతో కెలికి, నాలుగైదు వానపాములను పట్టుకున్నాడు. వాటిని దగ్గరలో కనుపించిన ఖాళీ అగ్గిపెట్టెలో వుంచుకొని, తాను

మామూలుగా కూర్చునేచోటనే కూర్చుని మళ్ళీ గాలం నీళ్ళలో వేశాడు.

రోజూవలెనే గాలి విసురుగా వీస్తున్నది. రోజూవలెనే కాలవ జోరుగా ప్రవహిస్తున్నది. రోజూవలెనే రైలు ఒకటి దూరంగా వంతెనమీద చప్పుడు చేసుకుంటూపోతున్నది... మల్లన్నకూడా రోజూవలెనే మళ్ళీ గాలం నీళ్ళలోవేసి చేపల నుద్దేశించి "రండి రండి చేపలూ, వానపాము రుచిగా వుంటుంది..అంత తీపిపదార్థం ఏదీలేదు..కొంచెం రుచిచూడండి" అనుకుంటూ కూర్చునివున్నాడు.

---

1962 ఆగస్టు - చుక్కాని